క్లుప్తంగా

కరాటే పోటీల్లో చిన్నారులకు పతకాలు



పెనమలూరు: జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో చిన్నారులు పతకాలు సాధించారు. యనమలకుదురుకు చెందిన వాన్‌కాన్ కరాటే డో ఫెడరేషన్ ఏపీ చీఫ్ ఎస్.దుర్గారావు సోమవారం వివరాలు వెల్లడించారు. మచిలీపట్నంలో ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో యనమలకుదురుకు చెందిన ఎ.శుభాష్ 13 సంవత్సరాల లోపు విభాగంలో ఆరెంజ్ బెల్ట్‌లో వెండి పతకం, ఎ.శ్రీహర్ష 11 సంవత్సరాల లోపు విభాగంలో ఆరెంజ్ బెల్ట్‌లో వెండి పతకం, ఎం.చరణి 6 సంవత్సరాలలోపు విభాగంలో ఎల్లో బెల్ట్‌లో బంగారు పతకం, జి.నైనా వెండి పతకం, ఎం.దక్ష 7 సంవత్సరాల లోపు విభాగంలో ఆరెంజ్ బెల్ట్‌లో బంగారు పతకం గెలిచారని తెలిపారు. కరాటే పోటీల్లో చిన్నారులు సత్తా చాటినందుకు అభినందించారు.

ఘనంగా రామాలయం పునఃప్రతిష్ట వార్షికోత్సవం

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునఃప్రతిష్ట 20వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి తులసిదళాలతో సహస్ర నామార్చన జరిపారు. అనంతరం వివిధ రకాల పరిమళభరిత పుష్పమాలలతో శ్రీసీతారామచంద్రస్వామి వార్లకు విశేష అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా భక్తులతో శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం, భగవన్నామ సంకీర్తనలు జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

'మాకాల'కు ఎక్స్‌లెన్స్ అవార్డు



పెనమలూరు: ఉత్తమ వైద్య సేవలు అందించిన డాక్టర్ మాకాల సత్యనారాయణకు ఎక్స్‌లెన్స్ అవార్డు వచ్చింది.ఈ మేరకు ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ గత 22 సంవత్సరాలుగా ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్, యోగాశక్తి చికిత్స ద్వారా ఎటువంటి మందులు వాడకుండా వైద్య సేవలు అందించినందుకు ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర వారు మాకాల సత్యనారాయణకు ఎక్స్‌లెన్స్ అవార్డు ఇచ్చి సత్కరించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సినీనటుడు సుమన్, అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జల జగన్‌బాబు, అధికార భాషా సంఘ సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు సమక్షంలో మాకాల ఈ అవార్డు అందుకున్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మకు పసుపుకుంకుమ సమర్పణ

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో సోమవారం చిన్న తిరునాళ్లలో భాగంగా అమ్మవారికి పసుపు కుంకుమాలను సమర్పించారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పసుపు కుంకుమలు, వివిధ రకాల నైవేద్యాలను భక్తులు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పలువురు కమిటీ సభ్యులు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

కార్మికులకు సీపీఎం సంఘీభావం

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో రిలయన్స్ గోడౌన్‌లో పని చేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన వారికి సోమవారం సీపీఎం సంఘీభావం తెలిపింది. గోడౌన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న వారిని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను ఒక్కసారిగా తొలగించటం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెబుతున్న ప్రభుత్వాలు ఈ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని అన్నారు. సీపీఎం నాయకులు కళ్లం రాంబాబు, స్వరూప రాణి, నాగరాజు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.35,09,786 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే బోడెప్రసాద్ పంపిణీ చేశారు. పోరంకిలోని టీడీపీ కార్యాలయంలో వీటిని బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, వెలగపూడి శంకర్‌బాబు, కోయా ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం-రైతులకు శాపం

- ఏలూరు కాలువ నిర్వహణ తీరు అధ్వానం
- కాల్వ మరమ్మతులు, పూడిక తీత పట్టించుకోని వైనం



బాపులపాడు మండలం పెరికీడు వద్ద కృష్ణా-ఏలూరు కాలువ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కృష్ణా-ఏలూరు కాలువ నిర్వహణ, మరమ్మతుల విషయంలో నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే కాలువ నిర్వహణ పనులు పూర్తి స్థాయిలో చేపటాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు ఊపందుకున్న తరుణంలో కృష్ణా-ఏలూరు కాలువ (కేఈ కెనాల్) కు నీళ్లు ఆపేసి మరీ తాపీగా మరమ్మతులు నిర్వహిస్తున్నారు. పూడిక తీత, గుర్రపు డెక్క తొలగింపు, గట్టు బలోపేతం చేయటం, మరమ్మతు పనులను వేసవిలోనే పూర్తి చేయాల్సిన ఇరిగేషన్ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించకపోవటంపై రైతులు మండిపడుతున్నారు.

కేఈ కెనాల్ పరిధిలో 1.25 లక్షల ఎకరాల ఆయకట్టు

కృష్ణా, ఏలూరు జిల్లాల్లో సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు, మరో 60 గ్రామాలకు తాగునీటిని కేఈ కెనాల్ అందిస్తుంది. ఖరీఫ్ సీజన్‌కు ముందుగా మార్చిలో టెండర్లు ఖరారు చేయటం, ఆ తర్వాత ఏప్రిల్, మే నెలల్లో ప్రధాన, ఉప కాలువల నిర్వహణ, మరమ్మతులను ఇరిగేషన్ అధికారులు చేపటాల్సి ఉంది. కానీ కాలువను సన్నద్ధం చేయకుండా నేరుగా సాగునీరు విడుదల చేయటంతో నీళ్లు కిందకు పారని పరిస్థితి ఏర్పడింది. సుమారు 65 కిలోమీటర్లు పొడవు కలిగిన కేఈ కెనాల్‌లో పలుచోట్ల దట్టంగా గుర్రపు డెక్క, తూడు, నాచు పేరుకుపోవటంతో నీటి ప్రవాహానికి అవరోధం ఏర్పడింది. దీంతో అప్పటికప్పుడు నీళ్లు ఆపి మరీ ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో అదనుకు సరిపడా సాగునీరు అందకపోవటంతో వరినారు ఎండిపోతోందని, వరినాట్లు వేసేందుకు, పొలాలు దుక్కి దున్నేందుకు నీళ్లు అందటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా కాలువ మరమ్మతులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగా కేఈ కెనాల్ మరమ్మతులు, నిర్వహణ పనులను పట్టించుకోకుండా వదిలేస్తున్న ఇరిగేషన్ అధికారులు వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో సాగునీరు నిలిపి వేయటంపై పరిపాటిగా మారింది. ఏయేడు కాయేడు నామమాత్రంగా కాలువ నిర్వహణ, మరమ్మతులు చేయటం వల్లే ఈ దుస్థితి ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు. అధికారుల తీరు వల్లే కాలువలో దట్టంగా గుర్రపు డెక్క, తూడు, నాచు పేరుకుపోతున్నాయని, దీంతో నీటి ప్రవాహనికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్, జూలై మాసాల్లో కాలువకు నీటి సరఫరా ఆపి మరమ్మతులు చేయటం సబబు కాదని, ముందస్తుగా ప్రణాళిక ప్రకారం వేసవిలోనే పూడిక తీత, మరమ్మతులు చేపడితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వాపోతున్నారు. గట్లు బలహీనంగా ఉండటంతో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీరు విడుదల చేస్తే గండి పడే ప్రమాదం కూడా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలువల నిర్వహణ అధ్వానంగా ఉంది



కృష్ణా-ఏలూరు కాలువ నిర్వహణ అధ్వానంగా ఉంది. ఈ వేసవిలోనే కాల్వ మరమ్మతులు పూర్తి స్థాయిలో నిర్వహించాలి. వరినాట్లు ఊపందుకున్న తరుణంలో ఏలూరు కాలువకు సాగునీరు నిలిపి వేయటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటి సరఫరా ఆపేసి మరమ్మతులు నిర్వహించటం విడ్డూరంగా ఉంది. ఈ సారైనా ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే కాలువల మరమ్మతులు చేపట్టాలి.

-పదకల శ్రీనివాసరావు, కాకులపాడు

గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ

ఉయ్యూరు: ఉయ్యూరు నగర పంచాయతీని గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో 2025-26 బడ్జెట్, సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.94.48 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. ఆదాయం రూ.2.95 కోట్లు, ఖర్చు రూ.2.86 కోట్లుగా పేర్కొన్నారు. చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ 2011లో ఉయ్యూరు నగర పంచాయతీ ఏర్పాటైందని, ప్రస్తుతం పెరిగిన జనాభా, ఆదాయం దృష్ట్యా ఉయ్యూరును గ్రేడ్ 2 మున్సిపాలిటీగా మార్చాలని కోరారు. జిల్లా కలెక్టరు ద్వారా ప్రభుత్వానికి ఈమేరకు నివేదిక అందజేస్తామన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రెయిన్లకు ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయింపులు చేశామన్నారు. సమావేశంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, సభ్యులు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంపు కోరుతూ వెటర్నరీ విద్యార్థుల ప్రదర్శన



గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న పశువైద్య విద్యార్థులు

గన్నవరం: ఉపకార వేతనాలు పెంచాలని గత 43 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడంపై స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం జాతీయ రహదారిపై కళాశాల నుంచి గన్నవరం వరకు ప్రదర్శన నిర్వహించారు. భారత మాత వేషధారణతో ఉన్న విద్యార్థినితో పాటు పలువురు విద్యార్థినిలు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని వినూత్న నిరసన తెలియజేశారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్‌లో మానవహారంగా నిలబడి న్యాయం కావాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నేతలు మాట్లాడుతూ...మెడికల్, డెంటల్, ఆయుష్ విద్యార్థులకు రూ.25 వేలు వరకు స్టైఫండ్ ఇస్తున్న ప్రభుత్వం వెటర్నరీ విద్యార్థులకు మాత్రం కేవలం రూ.7 వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. మూగజీవాలకు వైద్య సేవలందించేందుకు పశువైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి వివక్ష తగదన్నారు. ఏడాదికి పది శాతం చొప్పున ఫీజులు పెంచుతున్నప్పటికీ, గత పదమూడేళ్లుగా స్టైఫండ్ మాత్రం పెంచకపోవడం దారుణమన్నారు. చాలీచాలని ఉపకార వేతనాలతో చదువులు కొనసాగించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఆవేదనను అర్థం చేసుకుని కనీసం రూ.15 వేలు స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దిశగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘ నేతలు స్పష్టం చేశారు.

నున్న మార్కెట్లో మామిడి విక్రయాలు ప్రారంభం



నున్న మ్యాంగో మార్కెట్లో బంగినపల్లి మామిడి

విజయవాడరూరల్: నున్న మామిడి కాయల మార్కెట్లో ఈ ఏడాది మామిడి సీజన్ సోమవారం ప్రారంభమైంది. మామిడి కాయల మార్కెట్లో లాల్ అహ్మద్ షాపులోకి బంగినపల్లి మామిడి కాయలు పుట్రేల, ఎదురుమిడెం, కొర్లకుంట, నూజివీడు, నాగులూరు ప్రాంతాల నుంచి రైతులు ట్రాక్టర్లు, ఆటోలు, వ్యానుల ద్వారా అమ్మకానికి తీసుకొచ్చారు. మార్కెట్లో సుమారు 45 షాపులు ఉండగా కేవలం ఒకే ఒక్క షాపులో మాత్రమే మామిడి కాయల క్రయవిక్రయాలు ప్రారంభం అయ్యాయి. ఈ సంవత్సరం వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా బంగినపల్లి మామిడి కాయల దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. తేనెబంక, కోడిపేను మామిడితోటల్లో పూతను ఆశించడంతో నవంబరు, డిసెంబరు నెలల్లో పూసిన పూత రాలిపోయింది. పూత రాలకుండా పిందె దశ నుంచి కాయ దశకు రావాలని రైతులు అధిక ఖర్చులతో మందులను స్ప్రే చేసినా ఫలితం లేకుండా పోయింది. దీని ప్రభావంతో బంగినపల్లి మామిడికాయల దిగుబడి 25 శాతమే ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ అననుకూల పరిస్థితుల్లో ప్రారంభమైన మామిడి సీజను రైతులను నిరాశకు గురిచేసింది. కాయ నాణ్యత, సైజును బట్టి టన్ను మామిడి కాయలు 50వేల రూపాయల నుంచి 80 వేల రూపాయల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. మామిడి కాయల్లో రారాజుగా పిలిచే బంగినపల్లి మామిడి నున్న మార్కెట్ నుంచి ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. అలాంటిది ఈ ఏడాది బంగినపల్లి మామిడి కాయల దిగుబడులు ఆశించినంత లేకపోవడమే సీజను ఆలస్యంగా ప్రారంభం కావడానికి కారణమని వ్యాపారవర్గాలు అంటున్నాయి. కలెక్టర్ రకం మామిడికాయ కూడా ఆశించిన మేర దిగుబడులు లేకపోవడంతో ఈ ఏడాది మామిడి కాయల వ్యాపారం ఎలా ఉంటుందో వేచి చూడాలని మ్యాంగో గ్రోయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐ.శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి స్పందన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలో పైప్‌లైన్‌కు సోమవారం పంచాయతీ అధికారులు మరమ్మతులు నిర్వహించారు. ఈ ప్రాంతంలోని రామాలయం సమీపంలోని పైప్‌లైన్ లీక్ అవుతోందని, దానివలన తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయని తాజాగా 'సాక్షి' దినపత్రికలో 'వృథాగా పోతున్న తాగునీరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు సిబ్బందిని అప్రమత్తం చేసి పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ వేసవిను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామం, కాల్వగట్టు ప్రాంతాల్లో కలిపి 4 వాటర్ ట్యాంక్‌లు, మరో 4 మోటారు బోర్ల సహాయంతో తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామంలో మరో 3 నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఈమేరకు తీర్మానం పొందిన తర్వాత పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు.

పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల వినతి



ఎంపీడీఓ అనూషకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కంకిపాడు: పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ పి.అనూషకు వినతిపత్రం అందించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణలో శానిటేషన్ సిబ్బంది కొరత, డోర్ టు డోర్ కలెక్షన్ చేయటానికి టార్గెట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, పంచాయతీ పోర్టల్ సేవలు పంచాయతీ కార్యదర్శులపై మోయలేని భారం మోపుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇంటి పన్నుల సేకరణ, సమావేశాల నిర్వహణ, పౌరసేవలతో సతమతం అవుతూ అనారోగ్యాల బారిన పడాల్సి వస్తోందని వాపోయారు. పంచాయతీ కార్యదర్శులపై పడుతున్న భారాన్ని గుర్తించి ప్రభుత్వం పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పునాదిపాడు కార్యదర్శి బాపూజీ, మద్దూరు కార్యదర్శి సీహెచ్ కిరణ్‌కుమార్, కంకిపాడు కార్యదర్శి సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



ఈడుపుగల్లు పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

పెనమలూరు: మండల పరిధిలో పదవ తరగతి పరీక్షలు సోమవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి శేషగిరిరావు వివరాలు తెలుపుతూ మండల పరిధిలో రెగ్యులర్, ప్రైవేట్, ఒకేషనల్ పదవ తరగతి విద్యార్థులు 2415 మంది ఉన్నారు. మొదటి రోజు పరీక్షలకు 2400 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. మండలంలో మొత్తం 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ప్రశ్నపత్రాలను సకాలంలో ఆయా పరీక్ష కేంద్రాలను తరలించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని ఎంఈవో చెప్పారు.

గన్నవరంలో...

గన్నవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు గన్నవరం ప్రాంతంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్ట్ లాంగ్వేజ్‌లో పరీక్ష నిర్వహించారు. మండలంలోని మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. తొలిరోజు పరీక్షకు మండలంలో మొత్తం 1,117 మంది విద్యార్థులకు గాను 1,105 మంది హాజరైనట్లు ఎంఈఓ-1 కె. రవికుమార్ తెలిపారు. పన్నెండు మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు.

వైభవంగా వామన మూర్తి విగ్రహ ప్రతిష్ట



గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద గ్రామంలో కొండపై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి గుహాలయం ప్రాంగణంలో సోమవారం శ్రీ వామన మూర్తి విగ్రహం వాయు ప్రతిష్ట వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారిని విశేషంగా అలంకరించి, పుణ్య దంపతులతో హోమం నిర్వహించారు. వామన అవతారం విశిష్టతను భక్తులకు వివరించారు.

మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో 2024-25 రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము, పెసర కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ సోమవారం తెలిపారు. జిల్లాలో 2,76,930 ఎకరాల్లో మినుము, 6,870 ఎకరాల్లో పెసర పంటను సాగు చేశారన్నారు. మినుము క్వింటాకు రూ. 7,400, పెసర క్వింటాకు రూ. 8,682 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విక్రయించదలచిన రైతులు పరిసర ప్రాంతాల్లో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పెసరకు ఎనిమిది కేంద్రాలు, మినుము పంట కొనుగోలు 12 కేంద్రాలు ప్రారంభిస్తున్నామన్నారు.

వడ్డీతో సహా చెల్లించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారులకు చెక్కు మొత్తాన్ని వడ్డీతో చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల సోమవారం తీర్పు చెప్పారు. కంకిపాడు మండలం ఈడ్పుగల్లుకు చెందిన కోనేరు సాత్విక్‌కు సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఈడ్పుగల్లు బ్రాంచ్‌లో సేవింగ్ ఖాతా ఉంది. 2017 నవంబర్ 6న రూ.13.50 లక్షల హెచ్‌డీఎఫ్‌సీ చెక్కు క్లియరెన్స్ నిమిత్తం దాఖలు చేయగా అది ఖాతాలో జమ కాకపోవటంతో బ్యాంకు అధికారులను ప్రశ్నించగా, చెక్కు కొరియర్ ద్వారా క్లియరింగ్‌కు పంపామని ట్రాన్సిట్‌లో మిస్‌ప్లేస్ అయ్యిందని,మరొక చెక్కును ప్రజెంట్ చేయాలని బ్యాంకు అధికారులు చెప్పారు. సాత్విక్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు చెక్కు మొత్తం రూ. 13.50 లక్షలు 2017 నవంబర్ 6వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, లక్ష రూపాయలు మానసిక వేదనకు రూ. 10 వేలు ఖర్చుల నిమిత్తం 30 రోజుల్లోగా అందజేయాలన్నారు.

వికాస్ విద్యార్థులు 74 మందికి ఉద్యోగావకాశాలు



ఎంపికైన విద్యార్థికి నియామక పత్రం అందజేస్తున్న వికాస్ విద్యా సంస్థల సెక్రటరీ సత్యనారాయణరెడ్డి

నున్న(విజయవాడరూరల్): వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులు 74 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. కియా కంపెనీకి అనుబంధ పరికరాలు సరఫరా చేసే హుందాయ్ మూబీస్ కంపెనీ ఆధ్వర్యంలో డిప్లొమా, ఇంజినీరింగ్ విద్యార్థులకు సోమవారం ఉద్యోగ నియామక ప్రక్రియ (క్యాంపస్ సెలెక్షన్స్) నిర్వహించారు. హుందాయ్ మొబీస్ కంపెనీ ప్రతినిధులు జగన్నారాయణ, విజయ్ విద్యార్థులకు వివిధ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన 74 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. అనంతరం క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి ఉద్యోగావకాశాలను పొందిన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాంపస్ సెలెక్షన్స్‌లో మొత్తం 74 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించగా వారిలో 60 మంది డిప్లొమో విద్యార్థులు ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ జి.వర్ధీకాసులు, సీపీస్సీ విభాగాధిపతి కిషోర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సగరులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆత్కూరు గ్రామస్తులు

ఉంగుటూరు: సగర కులస్తులకు శ్మశానానికి స్థలం కేటాయించాలని ఆత్కూరు గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సగర సంఘ పెద్ద కర్నాటి వీరరాఘవులు మాట్లాడుతూ తర తరాలుగా ఇదే గ్రామంలో తాము నివసిస్తున్నా చనిపోయిన తరువాత పాతి పెట్టడానికి జాగా లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యను విన్నవించుకున్నా పరిష్కారం కాలేదన్నారు. ఎవరైనా సగర కులస్తులు చనిపోతే గ్రామంలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో సమాధి చేయడం ద్వారా అత్యధిక స్థలం పోతుందని భవిష్యతులో స్థలం లేని పరిస్థితి వస్తుందని గ్రామస్తుల నుంచి విమర్శలు వస్తున్నాయని అన్నారు. గతంలో ముస్లింలకు స్థలం కేటాయించాలని కోరగా వారికి విడిగా ప్రభుత్వం స్థలం కేటాయించిందని, అదేవిధంగా గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 661-1లో గల ఆక్రమిత ప్రభుత్వ భూమిని సగర కులస్తులకు శ్మశాన వాటికకు స్థలంగా కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో తల్లిబోయిన నాగరాజు, ఏడుకొండలు, నాగూరు, సీపీఎం నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని కల్పించాలి

ఉంగుటూరు: పొణుకుమాడు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. గ్రామంలో పర్యటించి గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామంలో ఉపాధి హామీ పనులు లేక గ్రామస్తులు ఇంటికే పరిమితమై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలన మురుగు సమస్య ఏర్పడుతోందని చెప్పారు. నూతనంగా నిర్మాణం చేపట్టిన పాఠశాల భవన నిర్మాణం నిలిచిపోయిందని, వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని పలు సమస్యలను చైతన్య యాత్ర బృందానికి గ్రామస్తులు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, రాజారావు, గంగాధర్ పాల్గొన్నారు.

పోరంకిలో ఉపవాస ప్రార్థనలు

పెనమలూరు: క్రైస్తవుల తపస్సు కాలం నలభై రోజుల ఉపవాస ప్రార్థనలు ఆదివారం రాత్రి పోరంకిలో నిర్వహించారు. కానూరు కార్మెల్‌మాత విచారణ గురువు ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. ఫాదర్లు ముగ్గురాళ్ల ఫ్రాన్సిస్, మేత్రి దేవదానం, రత్నరాజు, భక్తులకు దివ్యప్రసాదాలు పంపిణీ చేశారు. గంగూరు, సాలిపేట, కానూరు, కామయ్య తోపు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com